# రోడ్డుమీది మనిషి

మండు వేసంగి. గంట యింకా పన్నెండు కాలేదు. ఐనా ఎండలు మండిపోతున్నాయి. లోకమంతా సూర్యభగవానుడి నిండు పేరోలగంలా వుంది. చీమ చిటుక్కుమన్నా వినిపించేటంత నిశ్శబ్దం. చెట్లలో ఆకులు గూడా కదలడం మానేశాయి. తొండలు, ఉడతలు, కాకులు లాంటి క్షుద్ర ప్రాణులు సైతం తరుశాఖల్లో నక్కి కూర్చున్నాయి. బహుశా రేపటిదినం దిన పత్రికల్లో ఈనాటి ఉష్ణోగ్రత అయిదారు సంవత్సరాల రికార్డును అధిగమించిందన్న వార్త ప్రచురితం కావచ్చు.

స్తబ్ధురాలై వున్న భూదేవి నడుముకు చుట్టుకున్న మొలనూలులా కానవస్తోంది రంగం పేట, తిమ్మాపురం ట్రంకురోడ్డు.

ఇంచుమించుగా ఆ రోడ్డు నిర్మానుష్యంగా వుంది.

రోడ్డు కీవలా, ఆవలా చిట్టడివి.

మేతకోసం చిట్టడివిలోకి వచ్చిన పశువులు గూడా బాహాటంగా ఎండలోకి నడిచి రావడంలేదు. పొదల చాటున్నే ఒదుగుళ్లు పోతున్నాయి.

స్థూలదృష్టికి ఆ ప్రాంతం ప్రాంతమంతా గోడకు తగిలించి పెట్టిన చిత్తరువులా వుంది.

ఒకటే కదలిక. ట్రంకురోడ్డుపైన తూనీగలా జారిపోతున్న కారు.

అది నరసప్పగారి కారన్నది నలభై గ్రామాలవాళ్ళకు తెలుసు.

నరసప్పగారు పాతిక వేల రూపాయలు పోసి ఆ కారు కొన్నారు. నెలకు వందా యిరవై రూపాయ లిచ్చి డ్రయివరును పోషిస్తున్నారు. ట్రంకురోడ్డు గవర్మెంటువాళ్ళు వేసింది. ఆయన సుష్టుగా ఉపాహారం సేవించి కారులో కూచున్నారు. వేగంగా వెళ్ళమని కారుకు చెప్పవలసింది లేదు. జాగ్రత్తగా నడపమని డ్రయివరుకు చెప్పనక్కర్లేదు. ఆ రోడ్డు గూడా ఎగుడు దిగుళ్ళు లేకుండా నున్నగా వుండి, ప్రత్యేకించి ఖరీదైన కార్లకోసం వేయబడి వుండవచ్చు నన్న అపోహకు తావిస్తోంది. చుట్టూ నెలకొన్న ప్రపంచం మండిపోతున్నప్పటికీ, రాగద్వేష విరహితుడైన సంయమీంద్రుడి అంతరంగంలా ఆ కారులోపల ఎంతో చల్లగా వుంది, చాలా హాయిగా వుంది.

జేబులోవున్న సిగరెట్టు పెట్టె చేతికి చిక్కడానికి వీలుగా నరసప్పగారు సీటుపైన కాస్తా ఒత్తిగిల్లి కూర్చున్నారు. జేబులో

నుంచి సిగరెట్టుపెట్టె పైకితీస్తూ, తీస్తూ కిటికీ అద్దంలోనుంచి వెలుపలికి చూచారు. ఒక క్షణం. ఒకటే క్షణం. క్షణమాత్రపు స్వల్ప వ్యవధిలో నరసప్పగారికి రోడ్డుపైన ఓ ఆకారం కనిపించింది...

ఎవరతను? ఎవరబ్బా అతను?

నరసప్పగారు సిగరెట్టు ముట్టించుకున్నారు. పొగ ఒకసారి లోపలికి పీల్చి వదలగానే, మందకొడిగా నిద్రపోతున్నట్లున్న ఆయన జ్ఞాపకశక్తి తటాలున మేలుకుంది. నడుముకొక తుండుగుడ్డ, పైన తలగుడ్డ. ఇంతకుమించి వేరే ఆచ్ఛాదనం లేదు. గడ్డం దుబ్బులా పెరిగింది.

ముఖం ముడతలు పడింది. ఆ ఆకారంపైన ధారలు ధారలుగా చారికలుగట్టి కారుతున్న చెమట. చేత దుడ్డు కర్ర. బాగా బక్కచిక్కిన శరీరం. ఆ వ్యక్తి నరసప్పగారికి పరిచితుడే! ఆతడి పేరు రంగన్న.

"రంగన్నకు బాగా ముసలితనం వచ్చేసినట్టుంది..." అనుకున్నారు నరసప్పగారు.

నలభై యేళ్ళకు మునుపు రంగన్న యినపకడ్డీలా వుండేవాడు. మెడలో కంటె, కొసదేలిన మీసాలు, చేతిలో బానా కర్ర. ఈ వేషంలో అతడు పలనాటి యోధుడిలా కనిపించేవాడు. నరసప్పగారి కింకా బాగా గుర్తు. రక్తపింజరి అనేది ఒకరకమైన విషసర్పం. ఒకనాడది మల్లెపొదుకింద కనిపించింది. వెంటనే పొలంలో కలుపు తీయిస్తున్న రంగన్నకు పిలుపు వెళ్ళింది. అతడు వచ్చేదాకా మల్లెపొదు దరిదాపుల్లోకి వెళ్ళిన

వాళ్ళు లేరు. రంగన్న కర్ర చేతపుచ్చుకుని పొడిచి చూచాడు. ఒక్క పరుగుతో పాము ప్రహరీ గోడమీదికి పారిపోయింది. అది మట్టి గోడ. అయిదు మూరల ఎత్తుండేది. గోడపైన పల్చటి బండలు పేర్చి మదురుగా మన్ను పోసి వుంచారు. రంగన్న ఆ గోడపైకి ఎలా లంఘించాడో తెలియదు. మెరపు తీగలా ఆ సన్నటి గోడపైన దౌడుతీశాడు. వెంటాడి పామును చంపి పారేశాడు. అలాంటి సర్కస్ ఫీట్ అవలీలగా నిర్వ హించిన రంగన్న యిప్పుడు తారురోడ్డుపైన్నయినా నిటారుగా నిలబడి నడవలేకపోతున్నాడు! అంతా కాల మహిమ!

రంగన్న కనిపించగానే నరసప్పగారి ఆలోచనలన్నీ గతాన్ని త్రవ్వుకోసాగాయి. తన బుద్ధి తనకు తెలిసొచ్చేటప్ప టికి రంగన్నది కోడెప్రాయం. లోకంలో సామాన్యులకు చేత గాని అసాధ్యమైన పను లేవవైతే వున్నాయో, వాటిని రంగన్న ఒక్కడు మాత్రమే సరిపెట్టగలడని అప్పట్లో తనకొక నమ్మకం వుండేది. రంగన్న అమాంతంగా తాటిచెట్లెక్కి వంబాలు తెగ నరకగలడు. కొబ్బరి తోపులో ఒక చెట్టుపైనుంచి యింకొక చెట్టుపైకి దాటుకోగలడు. గండు చీమలు ముసురుకున్న చెట్టులో చిటారు కొమ్మన వున్న మామిడి పండు తెచ్చిపెట్ట గలడు. గుడి గోపురంలో వున్న పావురాళ్ళను పట్టుకరాగలడు. ఒక కుర్రవాడి కోరికలు చెల్లించడంలోనే గాదు, కుటుంబంలో యితరులు చేయలేని పనులన్నింటికీ రంగన్నే కావలసి వచ్చే వాడు. చేయి సాచి వరికట్టను అందుకుని సాపుగా కసువు వామి పేరుస్తున్న రంగన్న వంగినప్పుడు శివధనుస్సులా వుండే వాడు. నిల్చున్నప్పుడు కొండపైన జండా కొయ్యలా వుండే వాడు. కొంపదీసి కాలు జారితే ఏమౌతుందని తన అనుమానం!

ఆ మాటకొస్తే విపత్తులన్నీ రంగన్నకు మంచినీళ్ళ ప్రాయం. ఒకసారి పెళ్ళిచూపుకోసం పొరుగూరునుంచి బంధువులు వచ్చారు. వారిలో ఒకాయన మెట్టుపైన కూర్చుని స్నానం చేస్తుండగా వ్రేలికి తొడుక్కున్న ఉంగరం జారి కబిల బావిలో పడిపోయింది. అది ఎనిమిది మట్ల బావి. అయిదో మట్టుదాకా నీళ్ళున్నాయి. అట్టడుగున రాకాసి నాచు. అది కాళ్ళకు, చేతులకు చుట్టుకుంటే మనిషి కక్కడే సజీవ సమాధి. ఎంద రెందరు ఎన్నెన్ని విధాలుగా చెప్పినా లక్ష్యపెట్టాడు కాడు రంగన్న. బావిలో దూకాడు. రెండు మూడు నిమిషాలదాకా మనిషి పత్తాలేదు. ఇంకెక్కడి రంగన్న అంటూ పెదవి విరిచిన వాళ్ళు లేకపోలేదు. కానీ రంగన్న చావనూలేదు, ఉంగరం తియ్యకుండా పైకి తేలనూలేదు.

నరసప్పగారు కళ్ళు మూసుకున్నారు. తా నిప్పుడు నివసిస్తున్న యిల్లు నాన్నగారు కట్టించిపోయింది. నాన్నగా రందుకోసం డబ్బు వెచ్చించారేమో! కానీ శరీర శ్రమనుబట్టి చూస్తే అది ఎవరు కట్టించిన యిల్లు? లేదా ఎవరు కట్టిన యిల్లు? మన్ను కలపడంకోసం తెల్లవారుజామున్నే వెళ్ళి కబిల తోలి నవా డెవడు? మండుటెండలో నిలబడి యిటుకలు కోయిం చినవా డెవడు? చింతచెట్లు కొట్టిం దెవడు? మూటుపెట్టి యిటుకలు కాల్పించిం దెవడు? అన్నింటికీ మించి రిజర్వు ఫారెస్టులో గార్డుకు, వాచర్లకు తెలియకుండా నేరేడు చెట్లు నరికించి రాత్రికి రాత్రే బళ్ళకెత్తించి డొంకదారిగుండా యింటికి చేర్పించింది ఎవడు?

నరసప్పగారిని గురించి కిట్టనివాళ్ళు రకరకాలుగా చెప్పు కుంటారు. ఏది ఏమైనప్పటికీ ఆయన కృతఘ్నుడు మాత్రం

కాదు. అందు కాయన కళ్ళు చెమ్మగిల్లడమే ప్రత్యక్ష సాక్ష్యం!

అద్దంలోనుంచి డ్రయివ రెక్కడ చూచిపోతాడోనని నర సప్పగారు తల కొంచెం దించుకున్నారు.

ఒకనాడు తాను సీమచింతకాయలు కోసిపెట్టమని రంగ న్నతో పోరు పెట్టుకున్నాడు. అతడు తన పెళ్ళాం బిడ్డలతో కాపురమున్న యిల్లు ఆ సీమచింతచెట్లున్న తోపులోనే వుండేది. తనను కాయలు తింటూ కూచోమని చెప్పి రంగన్న తన పాక లోకి వెళ్ళొచ్చాడు. మోకాడెత్తులేని గోడలు, వెదురు తడికెల తలుపు, కొబ్బరిమట్టలతో కప్పు, పందు లుండడంకోసం గూళ్ళు కట్టిపెడతారు. ఆ పాక పందిగూడుకన్నా మెరుగ్గా లేదు.

"ఈ యింట్లో మీరు...... ఎలా వుండగలుగుతారు రంగన్నా?" అని తాను ప్రశ్నించాడు.

"ఏం చెయ్యమంటారు చినబాబుగారూ! మేం పేదోళ్లం. మా కీమాత్రం యిల్లు దొరకడమే బ్రమ్మాండం. పోనీలెండి! తమరు పెద్దోళ్ళయ్యాక యింతకంటే మంచిల్లు కట్టించిస్తే సరిపోలా?"

అదెంతపని! సునాయాసంగా రంగన్న కాపాటి ప్రత్యుప కారం చేసిపెట్టవచ్చు నన్న సత్సంకల్పం నరసప్పగారి కప్పుడే కలిగింది. కానీ అప్పటికింకా ఆయన కుర్రవాడు. వయసు ఏడో, ఎనిమిదో! మించిపోయిం దేమీలేదు. సత్సంకల్పాలు సత్కార్యాలుగా పరివర్తనం చెందడాని కింకా కావలసినంత వ్యవధి వుంది.

ఇంతలో చదువులకోసం నరసప్పగారు పట్టణానికి వెళ్ళ వలసివచ్చింది. ఆ పది పన్నెండేళ్ళలో ఆయన ఎప్పుడో సెల

వుల్లో మాత్రం స్వగ్రామానికి వచ్చి వెళ్తుండడం జరిగింది. పట్ట ణాల్లో చదువుకన్నా ముందుగా అక్కడి కృత్రిమ నాగరికత పల్లెటూరి విద్యార్థుల్ని మురిపిస్తుంది. నరసప్పగారిలోనూ ఆ మార్పు కనిపించకపోలేదు. "బాగున్నారా చినబాబుగారూ?" అంటూ రంగన్న పలకరిస్తే ఆయన కేదో యిబ్బందిలో తగులు కున్నట్టుండేది. హృదయ కవాటానికి పెద్ద అలిగర్ తాళం తగిలించిన ట్టుండేది. లోకంలో ఎన్నో మార్పులొస్తున్నాయి. కొందరికి పంటలపైన ఆదాయాలొస్తాయి. కొందరు వ్యాపా రాల్లో లాభాలు గడిస్తారు. మరికొందరికి ఉద్యోగాల్లో ప్రమో షన్ల నిచ్చెనలున్నాయి, "మాకు గాదులు లేవు, మా కుషస్సులు లేవు" అన్నాడో కవి. అలాంటి నిర్భాగ్యులకు ఏకైక ప్రతినిధిలా కనిపిస్తున్నాడు రంగన్న. శరీరంలో జవసత్వాలుడిగిపోయాయి. సంసారంలో బిడ్డల బలగం బలిసింది. ఇంటిచుట్టుపట్ల గానీ, వీధుల్లో గానీ, ఊరిబయట పొలాల్లో గానీ గోచిపాత పెట్టుకుని తిరుగుతున్న కుర్రాడెవడైనా కనిపిస్తే వాడు తప్పనిసరిగా రంగన్న కొడుకై వున్నాడు. చింకిపాతలతో, మురికి తలతో ఎవతైనా అమ్మాయి కనిపిస్తే అది రంగన్న కూతురై వుంది. "చూడు రంగన్నా! శుభ్రంగా ఈ పిల్లల కొకజత దుస్తులు కుట్టి యివ్వరాదూ? దమ్మిడీ ఖర్చులేకుండా ఉచితంగా చదువు చెప్పే స్కూళ్ళున్నాయిగదా! బడికి పంపించగూడదూ? నేల పైన వున్నవాళ్లు ఎల్లకాలం నేలపైనే వుండిపోవాలన్న నియమ మేమీ లేదే! నీదగ్గర డబ్బు లేదనుకో! నాన్నగారి నడిగితే యివ్వరూ?" యిలా రంగన్నతో ఓదార్పు మాటలేవో చెప్పా లనిపించేది నరసప్పగారికి. కానీ కేవలం ఉపదేశంవల్ల ఉపకారం జరుగుతుందా? చేతనైతే మేలుచేసి చూపించాలి. తనేమో

కాలేజిలో చదువుకుంటున్న విద్యార్థి. ఆదర్శాలను అమల్లో పెట్టడమంటే మాటలా? తాళంచెవులు చేతికి రావద్దూ?

వచ్చాయి. తాళంచెవులు గూడా చేతికి వచ్చాయి.

కానీ సత్కార్యానికి వెయ్యి విఘ్నాలు.

తీరా కార్యాచరణకు పూనుకోబోయేసరికి తల్లి అడ్డు తగిలింది. "కాదురా నాన్నా! రంగన్న పేరిటికి అయిదెకరాల నేల రాసిపెడతావా? ఎందుకూ? ఏంచేసుకుంటాడని? అత గాడి కేమైనా ఎద్దులున్నాయా? పోనీ నువ్విస్తున్న పొలంలో బావైనా వుందా? ఎరువులు వేయగలడా? నేను చెబుతున్నా నుగా! నువ్వంతపనిచేసి చూడు. ఏడాది తిరిగేలోగా అతడా నేలచెక్కను అమ్ముకోకపోతే నన్నడుగు..."

కావచ్చు. ఆ మాటగూడా నిజమేననిపించింది.

పోనీ, కుర్రవాళ్ళను చదివిద్దామనుకుంటే అప్పటికే వాళ్ళకు బడి వయసు దాటిపోయింది.

రంగన్న ఏపూట కాపూట భుక్తికి దొరికితే చాలు నను కున్నాడు. కుర్రవాళ్ళ దంత కుదురైనబుద్ధి గాదు. వాళ్ళు తమ అదృష్టాన్ని అన్వేషించుకోడంకోసం మూల కొకరుగా విడిపోయారు.

పెళ్ళాం పదేళ్ళకు మునుపు చనిపోయింది.

ఇల్లు లేదు. పిల్లలు లేరు. భార్య లేదు. ఆ వూరితో అతడికున్న లంకెలన్నీ తెగిపోయినట్టయింది.

తన చివరి రోజుల్ని అత డెక్కడ గడుపుతున్నాడో తనకు సరిగ్గా తెలియదు!

తన కూతుళ్ళలో ఒకరిని అతడీవైపున ఎక్కడో యిచ్చి పెళ్ళిచేసినట్టు జ్ఞాపకం. బహుశా యిప్పుడక్కడికే వెళ్తున్నాడేమో!

ఐనా యింత ఎండలోనా!

పాదాలకు చెప్పులు గూడా లేవేమో!

చెమటోడ్చి, ఎముకలు విరిచి, కండలు కరిగించి శరీరంలోని ప్రతి నెత్తురుబొట్టును యితరులకోసమే వెచ్చించిన వ్యక్తి...

బస్సులో వెళ్ళవుండవచ్చు. చేత డబ్బులుండవు.

ఏ వేళప్పుడు బయల్దేరాడో!

ఎప్పుడు తిన్న తిండో!

అయ్యో పాపం! తాను రంగన్న కొక యిల్లు కట్టించి యివ్వలేకపోయాడు. కొంత స్థిరాస్తి ఏర్పాటు చేయలేకపోయాడు. అతడి బిడ్డల కొక భవిష్యత్తు చూపించలేకపోయాడు.

ఐనా రంగన్న అల్పసంతోషి.

ఆపమని డ్రయివరుతో చెప్పి కారెక్కించుకుంటే అతడు తన జన్మ చరితార్థమైపోయినట్టు సంతోషిస్తాడు.

నరసప్పగారికి మళ్ళీ ఒక సత్సంకల్పం కలిగింది.

కానీ కారు రంగన్నను దాటుకుని పదో మైలులో పరుగిడుతోంది.